

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### మారని మనుషులు

**నార్త్ ఇండియన్స్** మనం వాళ్ళింటికి వెళ్ళినా, గుడికి వెళ్ళినా 'టీకా లగాకే జావ్' అంటారు. చిన్నప్పుడు మాకు 'టీకా' అంటే స్కూల్లో జబ్బ మీద పొడిచే వేక్సినేషన్. అందుకే టీకా అంటే, ఇంజెక్షన్ ఇవ్వడం వీళ్ళ ఆచారం ఏమో అనుకునేదాన్ని. కానీ బొట్టు పెట్టించుకోడం అని తర్వాత తెలిసింది.

మనవాళ్ళు ఇలా ఇళ్ళకొచ్చిన ముత్తైదువలకి బొట్టుపెట్టడం ఆచారంగా వుండేది. 'ఉండమ్మా బొట్టు పెడతా' అని ఏకంగా సినిమాకి టైటిలే పెట్టేసారు కూడా ఆ రోజుల్లో. కానీ రాను రాను ఇది కష్టంగా తయారయింది. ఈ ఆచారం కొంచెం అన్ సివిలైజ్డ్‌గా, భర్త లేని స్త్రీలని కించపరిచే విధంగా కూడా మారింది. నలుగురిలో కూర్చున్న ఈ స్త్రీలు గమ్మున బొట్టు పెట్టె పట్టుకుని రాగానే, "ఒద్దు" అని పక్కకి తప్పుకోడం, అపరాధం చేసినట్టు తలొంచుకోడం, అనాగరీకమైన చర్యకి బాధపడడంగా మారింది. ఇంట్లో ఆడవాళ్ళు లేకపోతే గడపకి బొట్టుపెట్టి వెళ్ళడం, ముత్తైదువలని ఒకలాగా, మిగతావాళ్ళని ఓ లాగా ట్రీట్ చెయ్యడం 2000 సంవత్సరం తర్వాత నేను అంతగా చూడడం లేదు.

కానీ మనం మారి అభ్యుదయం వైపు అడుగులేసినా, ఈ సినిమా వాళ్ళు మారరు కదా! 'ముత్తైదువుగా బ్రతుకే ధన్యం.." అంటూ పాటలు! అంటే, ఓ వేళ భర్తపోతే వాళ్ళ జన్మం వృధా అనా? అసలు వీళ్ళ తప్పేంటి భర్త పోవడం విషయంలో? అంతేకాకుండా ఇంక భర్త వున్న స్త్రీ చావు సీన్‌లలో విజృంభించేస్తాడు డైరెక్టర్... సదర్ చచ్చిన వేషంలో వున్న నటి మొహానికి పసుపు ముద్దలు మొత్తి, పెద్ద కుంకుమ బొట్టు పెట్టి, ఓ వేళ పిల్లలు కూడా చూస్తుంటే హడలి చచ్చేట్టు, భయపెట్టి ఆ శరీరానికి కడవలతో నీళ్ళు పోసి, పాడికట్టి, తన శాడిస్టిక్ ప్లెజర్ అంతా తీర్చుకుంటాడు. చివరకి మొన్న చిన్న పిల్లల కోసం తీసిన హనుమాన్ అనే సినిమాలో కూడా, వరలక్ష్మి అనే నటి (శరత్‌కుమార్ కూతురు) పాపం పోతే, ఇంత ప్రొసీజరూ చేయించాడు. అది పిల్లల సినిమా కదా! ఎవాయిడ్ చెయ్యచ్చనే ఆలోచనే" రాదు ఎందుకంటే, 'తాతా మనవడు' సినిమాలో అంజలీదేవి గారికి ఇవన్నీ చేస్తే, కాసుల వర్షం కురిపించారుట, ఆడవాళ్ళు ఏడుస్తూ, కొంగులు తడిపేసుకుని, మళ్ళీ మళ్ళీ వెళ్ళారుట. అదే ఫార్ములా ఈ AI యుగంలో కూడా ఆల్ఫాజెన్ కూడా వాడేసి, 'ఫెచ్చింగ్' సీన్స్ అని వాటికి పేరు

పెట్టారు. పెళ్ళి అనగానే రకరకాల ఆచారాలు కల్పించి పెడుతున్నారు. అవన్నీ శుభం కాబట్టి ఏ నార్త్ ఇండియన్స్ నుండి అరువు తెచ్చుకున్నా, ఏ ఆదివాసీ నృత్యాలు కాపీ కొట్టినా ఫరవాలేదు. కానీ ఈ సంప్రదాయాల పేరిట భయానక దృశ్యాలు తెర మీద అవసరమా? నాటక లక్షణాలులో చావు, ఆహారం, మైధనంలాంటివి తెరమీద చూపకూడదు అని చిన్నప్పుడు చదువుకున్నాం. కానీ ఇప్పుడు తెరమీద చూపకూడనివి ఏమీలేవు.'

ఇంక భర్త పోయి భార్య వున్న సినిమాల్లో ఆమెకి తెల్లచీర కట్టడం, అమానుషంగా మిగిలిన సుమంగళీ స్త్రీలు ఆమె గాజులు బలాత్కారంగా బద్దలు కొట్టడం, నుదుట అరచెయ్యి పెట్టి, రాష్‌గా ఆమె మొహాన్నున్న బొట్టు తుడిచెయ్యడం, తట్టెడు పూలు జడలో పెట్టి, బరబరా పీకెయ్యడం లాంటి శాడిస్టిక్ సీన్‌లు అన్నీ పెడ్తారు.

ఇవన్నీ  వీళ్ళ కల్పితాలా? అంటే కాదు ఒకప్పుడు ఇంతకన్నా దారుణాలు చేసారు. ముక్కుపచ్చలారని పసిబిడ్డలకి బోడిగుండ్లు కొట్టించి, రవిక లేకుండా తెల్ల సైను పంచెలు కట్టించారు. ఇంకా ముందు మొగుడి చితిలోనే తోసి 'సతి' అని దానికి పేరు పెట్టారు. కానీ రాజారామ్మోహన్ రాయ్‌లూ, వీరేశలింగం పంతులు లాంటి వారు అవన్నీ పోగొట్టి హాయిగా చదువుకుని, అభివృద్ధీ సాధించి బతకమంటే, ఈ సినిమాలూ సీరియళ్ళూ మరిచిపోనివ్వకుండా గుచ్చుతుంటారే ఈ సీన్లు పెట్టి. అవి గిట్టుబాటు అయ్యే సీన్లట. ... బుద్ధుందా అలాంటి మాటలు అనడానికి?

ఇంకా హిందీ సినిమాల్లో, సీరియళ్ళలో 'కర్వా చౌత్' ఏడాదికి ఒకసారి మన వరలక్ష్మీ వ్రతంలా వచ్చిపోయే వ్రతం, వీళ్ళ పుణ్యమా అని, ఏడాది పొడవునా చూపిస్తారు. అది చూసి వాత పెట్టుకునే మన తెలుగువాళ్ళుకూడా. అసలు ఇలా లక్షలు తగలేసి 'సంగీత్‌లూ', 'హల్దీ'లూ కూడా వారి నుండి అరువు తెచ్చుకున్న వేడుకలే! వేడుకలు వాడుకలయి మధ్య తరగతి తల్లితండ్రులు అప్పుల్లో కూరుకుపోయేటట్లు చేస్తున్నాయి. అసలు ముసలాళ్ళ దగ్గరనుండీ కొరియోగ్రాఫర్ నేర్పించిన స్టెప్పులకి వాళ్ళకి వాళ్ళు నయనతారలూ, చిరంజీవులూలాగా ఫీలయి డాన్స్ చేసేస్తుంటారు. అవి వారికి మాత్రమే చూడ్డానికి బావుంటాయి. ఇవన్నీ సరదాలు కాబట్టి కొంతవరకూ భరించవచ్చు. కానీ దురాచారాలని టీ.వీల్లో చూపించడం సహించరాని విషయం.

పదవరోజున భర్త పోతే స్త్రీకి చేసే ఆచారాలని ఈ కాలంలో పిల్లలు చాలావరకూ ఎదిరించి, ఆపుతున్నారు. కానీ విచిత్రం ఏమిటంటే, సాటి స్త్రీనే ఆమెకి బద్ధ శత్రువులా, ఆ రోజున ఆమెని విధవగా చూడకపోతే తర్వాతనుంచి రోజు, శకునం చూసి తప్ప చూడకూడదని, జీలకర్ర కానీ ఉప్పుకానీ నోట్లో వేసుకుని, క్యూలు కట్టి వచ్చి చూసి వెళ్ళడం.. ఇవన్నీ దురాచారాలు అని చదువుకున్న వాళ్ళకి తెలియడంలేదు. భయం.. అలా చెయ్యకపోతే తమ ఐదవతనానికి ముప్పేమో అని. మరి అనాదిగా చేసినా ఆచారాలన్నీ చేస్తున్నారా? ఇది మాత్రం చెయ్యడానికి?

ఇద్దరు ఆడవాళ్ళు ఇంటికి వస్తే. ఒకరికి బొట్టుపెట్టి, పండు ఇచ్చి, మరొకరికి భర్త పోయాడని, వట్టి పండు ఇవ్వడం అవమానించడం కాదా? వాళ్ళు ఎదురొస్తే వెనుతిరిగి పోయేవాళ్ళు ఇంకా ఇప్పటి సమాజంలో కూడా వున్నారు.

మా ఇంట్లో పనిమనిషుండేది శ్యామలమ్మ అని. నాకు పదేళ్ళ వయసున్నప్పటినుండి తనే నన్ను మార్నింగ్ షోలకి తీసుకెళ్ళి 'సినిమాభ్యాసం' చేయించిన గురువు. పల్లీలు వలుచుకు తింటూ, సినిమాల్లో ఇలాంటి సీన్లు వస్తే "తూ! మీ జన్మ మీరు మారర్రా" అని "ఆ పిల్ల చేసిన తప్పేందిరా నీ మొకంల మన్నుపడ" అని ఆ సినిమా తీసినవాళ్ళని తిట్టేది.

"అలా" తిడ్తున్నావేంటి? వాళ్ళు చూపించేది తప్పా? అని నేను అడిగితే "పంధొమ్మిదేళ్ళకి నా మొగుడు పోతే ఇంట్ల మామ దగ్గరకెల్లి దుకాన్‌ల అరువిచ్చే శేఠ్ దాకా అందరూ నా మీద చెయ్యి వెయ్యాలని చూసారు.. నేను మిఠాయి షాప్‌ల పని చేసే దశరథ్‌తో పారిపోయి మళ్ళీ పెళ్ళి చేసుకున్నా" అంది.

"ఓ ఆ దశరధ్ ఏనా నీ పిల్లలందరికీ తండ్రి?" అని మా అమ్మ అడిగితే "వానికి ఆయుష్షు లేక కళా, జగన్, రఘూ పుట్టాక పోయాడమ్మా" అంది.

"మరి అశోక్, లతా, మోహన్ ఎవరి సంతానం?" అని అమ్మ అంటే

"మల్లేష్‌ని చేసుకున్నాగా.. తాగొచ్చి మస్తు కొడ్తుండేవాడు" అంది.

"అతనూ పోయాడా?" అని అమ్మ అడిగితే

"లేదు నేనే వదిలేసాను" అంది.

అప్పట్లో నాకు తెలియలేదు కానీ అంతకన్నా ఫెమినిజం ఏముంది చెప్పండి.

చిన్నగా నవ్వి "ఎందర్ని చేసుకున్నా, నా రెక్కలు ముక్కలు చేసుకుని పది ఇళ్ళల్లో పాచి పనులు చేసుకుంటే కానీ, నా బిడ్డలు పొట్టలు నింపలేకపోయా! ఈ సినిమాల్లో చూపించే 'ముత్తైదువా, పతివ్రతా' అన్నీ కడుపు నిండిన వాళ్ళకమ్మా" అని తేల్చేసేది.

ఎవడైనా తాగొచ్చి, మీద చెయ్యేస్తే, వాడి ఎముకలన్నీ సున్నం అయ్యేదాకా తన్నేది. ఆడపులిలా వుండేది.

ఎంతోమంది స్త్రీలు నా జీవితంలో ఇన్స్పిరేషన్..అందులో నాకు తెలిసీ తెలీని వయసులో బాలాజీ థియేటర్‌కి అర్ధరూపాయి టికెట్ మీద మార్నింగ్ షోలు చూపించిన శ్యామలమ్మ కూడా ఒక స్త్రీ.

విలన్ వెంటబడ్తే, హీరోయిన్ రోడ్డూ జనాన్నీ వదిలేసి, జనసాంద్రత లేని మారుమూల నిర్మానుష్యమైన ఏ పాడు పడ్డ బిల్డింగ్‌లోకో పరిగెత్తి, మెట్లెక్కి పైకి పైపైకి ఎక్కేస్తుంటే "ఒసే పాగల్‌దానా! వానికి మంచి సోటు ..సూపిస్తున్నావా.? దిక్కుమాలినదానా.. జనం వున్న దగ్గరకి పోవే వెర్రిదానా" అని థియేటర్‌లో అరిచి చెప్పేది శ్యామలమ్మ.

సినిమాలంటే ఆ వయసులోనే నాకు ప్రేమని కలిగించిందీ, ఆలోచింపచేసిందీ మా శ్యామలమ్మ. 'ఈ రోజు నా ప్రొఫెషన్‌కి ఆనాడే బాట వేసిన మార్గదర్శి మా శ్యామలమ్మ.

ఎందరో గొంతువిప్పి మాట్లాడలేని స్త్రీలకి ప్రతినిధి శ్యామలమ్మ.

Post your comments


కాలమ్ దాటని కబుర్లు


కాలమ్ దాటని కబుర్లు-II


కాలమ్ దాటని కబుర్లు-3